సాక్షి తిరుపతి

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



రారండోయ్..వేడుకచూద్దాం!

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం వైభవంగా అంకురార్పణ చేశారు.

- 10లో



క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

క్రీడలతో మానసికోల్లాసం పెరగడంతోపాటు ఒత్తిడి దూరమవుతుందని ఎస్పీడీసీఎల్ సీఎం డీ సంతోషరావు తెలిపారు.

- 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	23
చిత్తూరు	33	23
తిరుమల	30	19
గూడూరు	36	26
నగరి	34	24

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,304 మంది స్వామివారిని దర్శించుకోగా 22,391 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రెన్యూవల్ చేయించుకోండి

తిరుపతి అర్బన్: జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధిపొందడానికి విద్యార్థులు రెన్యూవల్ చేయించుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆయా పథకాలతో జిల్లాలో 89,462 మంది లబ్ధిపొందుతున్నారని, అయితే రెన్యూవల్‌కు సంబంధించి 56,659 మంది చేయించుకోవాల్సి ఉండేదని చెప్పారు. ఇటీవల 42 వేల మంది చేయించుకున్నారని వెల్లడించారు. ఇప్పటికీ 14,659 మంది రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉందని వివరించారు. రెన్యూవల్ పూర్తి చేస్తేనే పథకాల ద్వారా విద్యార్థులకు లబ్ధిచేకురుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు చదువుకుంటున్న కళాశాలల్లో పేర్లతోపాటు ఆధార్ వివరాలను తెలియజేస్తే రెన్యూవల్ పూర్తిచేస్తారని వెల్లడించారు.

నేటి నుంచి ఈకేవైసీపై సోషల్ ఆడిట్



ఎస్.ప్రసాద్‌రావు, డీఏఓ

తిరుపతి అర్బన్: రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 99 శాతం ఈ క్రాప్ పూర్తిచేశామన్నారు. అలాగే 97 శాతం ఈకేవైసీ పూర్తిచేసినట్లు వెల్లడించారు. ఈనెల 13వ తేదీకి ఈ క్రాప్ చేయించుకోవడానికి గడువు ముగిసిందన్నారు. అభ్యంతరాలు ఉన్న రైతులు 23వ తేదీ వరకు చేపట్టనున్న గ్రామసభల్లో తెలియజేయాలని సూచించారు. 25వ తేదీన ఆర్బీకేల్లో తుది జాబితాను ప్రచురిస్తామన్నారు.



జెండా ఊరేగింపులో భక్తుల సందడి



హాస్పిటల్ రోడ్డులో అలరిస్తున్న ఆంజనేయస్వామి హోర్డింగ్

జెండా.. మదినిండా!

- అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి జెండా ఉత్సవం
- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న విద్యుత్ దీపాల అలంకరణ

గూడూరు రూరల్: దసరా ఆరంభానికి ముందు గూడూరు పట్టణంలో నిర్వహించే ఆంజనేయస్వామి జెండా ఉత్సవాన్ని పట్టణంలోని పలు కమిటీల సభ్యులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత కర్ణాలవీధి, తూర్పువీధిలోని ఆంజనేయస్వామి జెండాను ఊరేగించారు. పట్టణంలోని ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన జెండాలను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యువకుల కేరింతలు, డీజేల శబ్దాలు మార్మోగాయి. పలు జెండాల వద్ద విచిత్ర వేషాలు వేసుకుని నృతాలు చేయడం, బేతాళ నృత్యాలు, కేరళా వ్యాయిద్యాలు, తెనాలి బ్యాండ్, తీన్‌మార్ డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాస్పిటల్ రోడ్డు నుంచి సంఘం థియేటర్ వరకు మిట్టపాళెం వాసులు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా కర్ణాల వీధి, తూర్పువీధి, అలఘునాథస్వామి వీధి, పటేల్‌వీధి, శివాలయం వీధి, రాజరాజేశ్వరిగుడి వీధి, గమ్మళ్లపాళెం, ఐసీఎస్‌రోడ్డు, విఘ్నేశ్వరపురం, రాజావీధి, మాయాబజార్, అరుంధతీయపాళెం, మాళవ్యనగర్, వీరారెడ్డిపల్లి, మహాలక్ష్మీవీధి, జానకీరామ్‌పేట, నరసింగరావుపేట తదితర ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు పలువురిని మంత్రముగ్ధులను చేశాయి.

నేడు కలశ స్థాపన

పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉండే నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ గుడిలో ఆదివారం కలశ స్థాపన చేసేందుకు ఆయా కమిటీల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా మరుసటి రోజు ఈ కార్యక్రమం చేపట్టి 9 రోజుల పాటు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. చివరి రోజున భారీ ఊరేగింపు ఉంటుంది.

పటిష్ట బందోబస్తు

జెండా ఉత్సవం సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 350 మంది పోలీసులతో పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేసినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారయణరెడ్డి తెలిపారు.

● బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఊరేగుతున్న విష్వక్సేనుల వారు

తిరుమలలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. - తిరుమల

భానూ.. తెలుసు నీ బాగోతం

- తండ్రి మరణానికి కారణమైన చరిత్ర నీది
- కన్నతల్లే ద్వేషించే కొడుకువి నువ్వు
- మహిళలను దూషించే నీచ సంస్కృతి నీది
- టీడీపీ నేత గాలి భానుప్రకాష్‌పై మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు



నగరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

నగరి: టీడీపీ నేత గాలి భానుప్రకాష్ బాగోతమంతా తమకు తెలుసని, కన్నతండ్రి చావుకు కారణమైన దుర్మార్గుడని, అతడి వ్యవహారశైలి నచ్చకే కన్నతల్లి సైతం ద్వేషిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. శనివారం పట్టణంలో 'ఛీ ఛీ తెలుగుదేశం.. ఆపండి మీ దొంగ నాటకం' అంటూ కేవీపీఆర్ పేట నుంచి ఓంశక్తి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష నిర్వహణ కోసం ఆస్పత్రి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను చూసి భయపడి కారుతో లారీని ఢీకొని పరుగులు తీసిన భానుప్రకాష్ దిగజారుడు రాజకీయాలకు తెరతీశాడని ఆరోపించారు. మద్యం మత్తులోని పచ్చమూకలు పక్కన చేరడంతో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో మెలగాలి

- బ్రహ్మోత్సవాల సిబ్బందికి ఎస్పీ సూచన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో వివిధ రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చిన పోలీసు సిబ్బందికి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. శనివారం తిరుమల పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బందితో మాట్లాడుతూ తిరుమలలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం దేవునికి సేవ చేయడమే అన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. విధుల్లో నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరు యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతాఏర్పాట్లు చేపడుతున్నట్టు ఎస్పీ తెలిపారు. గరుడోత్సవం రోజున 4 నుంచి 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. బ్రహ్మోత్సవాలకు 3,054 మందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. మొదటి విడతలో 2,622 మంది, గరుడసేవ రోజున అదనంగా మరో 1,160 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గరుడ సేవను పురస్కరించుకుని 18వ తేదీ మధ్యాహ్నం నుంచి తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను అనుమతించమని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం 10 పోలీస్ సబ్‌కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేరాల నియంత్రణకు 170 మందితో క్రైమ్ పార్టీ అధికారులను నియమించినట్టు ఎస్పీ వెల్లడించారు.





డ్రోన్ సాయంతో విత్తనాలు వెదజల్లుదాం

చంద్రగిరి: అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి డ్రోన్ సాయంతో విత్తనాలను వెదజల్లడం మంచి పద్ధతని పనపాకం ఎఫ్ఆర్ఓ మాధవీలత తెలిపారు. శనివారం మండల పరిధిలోని మామండూరు అటవీ ప్రాంతంలో గుబ్బాకోల్డ్ స్టోరేజ్ బ్రాండింగ్, కమ్యూనికేషన్ మేనేజర్ కృష్ణా ఆధ్వర్యంలో విత్తనాలు వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. అటవీ ప్రాంతంలో సాధ్యం కాని ప్రాంతాల్లో కూడా సునాయాసంగా డ్రోన్ సాయంతో మొక్కలను వృద్ధిచేయొచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద మామండూరు, ముంగళిపట్టు, పనపాకం అటవీ ప్రాంతాల్లో చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రయోగం సత్ఫలితాలు ఇస్తుందని ఆశిస్తున్నామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఇప్పటికే మామండూరు ప్రాంతంలో సుమారు 200 కిలోలకుపైగా విత్తనాలు వెదజల్లినట్టు తెలిపారు. ఇందులో రాగి, మర్రి, వెలగ, బొప్పాయి, సీతాఫలం తదితర విత్తనాలు ఉన్నాయన్నారు.


డ్రోన్ సాయంతో విత్తనాలు చల్లేందుకు సిద్ధం చేస్తున్న అటవీ అధికారులు

ముంగళిపట్లు, పనపాకం అటవీ ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో విత్తనాలు వెదజల్లుతామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ చిన్నబాబు పాల్గొన్నారు.

టీటీడీ కళాశాలల్లో డిగ్రీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : టీటీడీకి చెందిన శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్వీ ఓరియంటల్ కళాశాల, ఎస్వీ సంగీత, నృత్య కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని టీటీడీ అధికారులు తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వర్తించవు. అభ్యర్థులు ఈ విషయాన్ని పరిగణించి అడ్మిషన్లు పొందవచ్చని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.



నవోదయ దరఖాస్తుకు 31వ తేదీ ఆఖరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి 2024 ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్.విశ్వనాథ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 9వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మే 1, 2009 నుంచి జూలై 31 2011మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలన్నారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. పరీక్ష 2024 ఫిబ్రవరి 10వ తేదీన ఉంటుందన్నారు.

మూడో విడత వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి కల్చరల్: స్విమ్స్ యూనివర్సిటీలో 2023–24వ విద్యా సంవత్సరానికి బీఎస్సీ, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ పారామెడికల్ కోర్సులలో ప్రవేశం కోసం మూడవ విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు స్విమ్స్ వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందపరిచిన లింకు ద్వారా కోర్సుల ఎంపిక చేసుకోవాలని సూచించారు.













రారండోయ్...వేడుక చూద్దాం!


అంకురార్పణలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

- తుమ్మలగుంట కల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- ఆగమోక్తంగా వైదిక క్రతువులు
- హాజరైన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి దంపతులు


బ్రహ్మోత్సవాల అంకురార్పణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం వైభవంగా అంకురార్పణ చేశారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను అలంకార మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ, శుద్ధి క్రతువులు ఆగమోక్తంగా నిర్వహించారు. యాగశాలలో నిర్వహించిన అంకురార్పణ క్రతువులో నవధాన్యాలను నవపాలికల్లో నింపి సకల దేవతలను స్వామి వారి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం స్వామి వారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షణ చేసేందుకై విశ్వక్సేనుల వారిని మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, ఈఓ నల్లందుల సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

23.5 కిలోల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్: వేర్వేరు చోట్ల అక్రమంగా రవాణా చేస్తున్న 23.5 కిలోల గంజాయిని నాయుడుపేట, గూడూరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్లు ఆర్‌యూవీఎస్. ప్రసాద్, పీ.విజయకుమార్ శనివారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు సంబంధించి వివరాలను తిరుపతి జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏ.రాజేంద్ర శనివారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో స్థానిక ఎస్ఈబీ సీఐ ప్రసాద్ సారథ్యంలో పోలీసులు నాయుడుపేట పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులు కలిగి కనిపించారన్నారు. విచారణలో వారి వద్ద ఉన్న 20.5 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. దీని విలువ రూ.3 లక్షలకు పైగా ఉంటుందన్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రయాణికుల మాదిగా తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు చేందిన విజయ్‌కుమార్ మధు, శ్రీనివాసన్ చిన్నస్వామి, శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురానికి చెందిన రంగాల కలియరెడ్డి ముఠాగా ఏర్పాడి గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులపై తమిళనాడు, ఆంధ్రలో అనేక కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఆదేవిధంగా గూడూరు ఆర్టీసీ బస్టాండులో సీఐ పీ.విజయకుమార్, ఎస్ఐ శేషమ్మలు ఎస్ఈబీ పోలీసులతో తనిఖీలు చేయగా ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన ఈశ్వర్ మడ్కామి అనే వ్యక్తి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధినం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. దీని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. నాయుడుపేట డివిజన్ పరిధిలో రేండేళ్లుగా 260 గంజాయి కేసులు నమోదయ్యాయని, ఇందులో మొత్తం 737 మంది నిందితులను అరెస్టు చేసి సుమారు 3,624 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనివిలువ రూ.4 కోట్లాకు పైగా ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఈబీ గూడూరు ఏఈఎస్ జే.రమేష్, నాయుడుపేట, గూడూరు సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

తిరుపతి రూరల్: క్రీడలతో మానసికోల్లాసం పెరగడంతోపాటు ఒత్తిడి దూరమవుతుందని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, జెన్‌కో విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ హాకీ, బాస్కెట్ బాల్, షటిల్ పోటీలు–2023 ప్రారంభమయ్యాయి. తిరుపతి వేదికగా మూడు రోజుల క్రీడా సంబరాలను శనివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో సంతోషరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించుకోవాలన్నారు. తద్వారా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విద్యుత్ సంస్థల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని సూచించారు. డైరెక్టర్లు సుబ్బరాజు, శశికళ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 300 మంది విద్యుత్ ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఉద్యో గులు స్నేహపూరిత వాతావరణంలో క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఇటీవల జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన ఉద్యోగులను దుశ్శాలువలు, జ్ఞాపికలతో సన్మానించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు లక్ష్మీనరసయ్య, ధర్మజ్ఞాని, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పంటా శ్రీనివాసులురెడ్డి

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గూడూరు పట్టణానికి చెందిన పంటా శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరి కేసీ.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు.

